keratam.in www.digital.keratam.in

# కెరటం

డిజిటల్ విప్లవం

బుధవారం, 18 అక్టోబర్, 2023 పేజీలు : 08

## తుమ్మలకు డాక్టర్ల మద్దతు.. ?

ఎన్నికల ప్రచార కార్యక్రమాల్లో భాగంగా మాజీ మంత్రి కాంగ్రెస్ నాయకుడు తుమ్మల నాగేశ్వరరావు మంగళవారం ఖమ్మం నగరంలోని పలువురు వైద్యులను కలిశారు. సామాజిక వేత్త, ఐఎంఎ మాజీ సెక్రటరీ, యువం ఫౌండేషన్ చైర్మన్, ప్రముఖ చిన్నపిల్లల వైద్య నిపుణుడు డాక్టర్ కూరపాటి ప్రదీప్ కుమార్ ను తుమ్మల కలిశారు. దాదాపు అరగంట పైగా జరిగిన భేటీ లో తుమ్మల డాక్టర్ ప్రదీప్ కుమార్‌ను కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇవ్వాల్సిందిగా కోరారు. అనంతరం తుమ్మల ఖమ్మం నగరంలోని మరికొంతమంది వైద్యులతో సంప్రదింపులు జరిపారు. ఇందులో వివిధ సామాజిక వర్గాలకు చెందిన ప్రముఖ వైద్యులున్నట్టు తెలుస్తోంది. నిత్యం వేలాది మందితో ప్రజా సంబంధాలు కలిగి ఉండే ప్రయివేటు వైద్యులను కలిసి తనకు మద్దతు ఇవ్వాలని తుమ్మల కోరినట్టు తెలుస్తోంది. ఈ క్రమంలోనే పలువురు వైద్యులు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని తుమ్మలకు హామీ ఇచ్చినట్టు తెలుస్తోంది. ఇదిలా ఉండగా రాహుల్ పర్యటనలో భారీ చేరికలే లక్ష్యంగా మాజీ మంత్రి తుమ్మల భారీ వ్యూహం రచించారని ఖమ్మంలో హాట్ టాపిక్‌గా మారింది.

**ఎవరికెవరు ఈ లోకంలో ఎవరికి ఎరుక.. ఏదారెటు పోతుందో ఎవరినీ అడగకా.. అని సినీ కవి రాసినట్టు.. ఏ నిమిషానికి ఏమి జరుగునో ఎవరూహించెదరు..** అని రాసిన మరో సినీకవి సాహిత్యంలోని పదాలు ఇప్పుడు ఖమ్మం జిల్లా రాజకీయాలను పరిశీలించిన వారికి అక్షరాలా కండ్ల ముందు కనిపిస్తున్నాయి.. అంతా నిన్నటి దాకా ఒకే గూటి పక్షులు.. కానీ అంతలోనే అనూహ్యంగా బీఆర్ఎస్‌లో మార్పులు.. నేడు కొందరి అలకలు.. మరికొందరి పార్టీ మార్పులు.. తామంతా ఒకే పార్టీలో ఉన్నా.. ఒకే వేదికపై ఉన్నా.. ఒకరికి ఒకరిపై అనుమానపు చూపులు.. ఎవరెప్పుడు జారి పోతారో..ఎవరు ఎవరికి టచ్‌లో ఉన్నారో తెలియని అనుమానం.. బీఆర్ఎస్‌లో చాలా మంది కాంగ్రెస్ కోవర్టులు ఉన్నారా..? పైకి బీఆర్ఎస్ పెద్దల వద్ద ఐక్యంగానే ఉన్నట్టు కనిపించినా.. లోలోన ఏదో తెలియని అనుమానం.. అపరచాణక్యుడు, మాజీ మంత్రి తుమ్మల ఖమ్మంలో పోటీచేస్తున్నారని తెలియగానే ఎందుకింత హై టెన్షన్ వాతావరణం..? యావత్ రాష్ట్ర రాజకీయాలను ఖమ్మం వైపు చూసేలా రణక్షేత్రాన్ని తలపిస్తున్న ఖమ్మం నియోజకవర్గంలో బీఆర్ఎస్‌కు అడ్డుకట్ట వేసేందుకు కాంగ్రెస్ పార్టీ ఓట్ల వేటలో అనుకున్న లక్ష్యం సాధిస్తుందా..? అతి త్వరలోనే జరుగనున్న రాహుల్ పర్యటనలో కాంగ్రెస్‌లోకి భారీ చేరికలు ఊహించని విధంగా ఉండబోతున్నాయా..? అంటే ఎక్కువ మంది అనువనే అంటున్నారు.. అభివృద్దే తారకమంత్రంగా పనిచేసే తుమ్మల, ప్రజా బలం ఉన్న నాయకునిగా గుర్తింపు ఉన్న మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, హ్యాట్రిక్ ఎమ్మెల్యే, సీఎల్పీ నేత మల్లు భట్టివిక్రమార్క, మాజీ కేంద్ర మంత్రి ఫైర్ బ్రాండ్ రేణుకా చౌదరి, రాజకీయంగా తలపండిన సీనియర్ మంత్రి సంభాని చంద్రశేఖర్, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, తదితరుల దిగ్గజ నాయకులు ఒకే వేదికపైకి వస్తే కాంగ్రెస్ గెలుపును బీఆర్ఎస్ నిలువరించగలదా..? అనే అనుమానాలు మరింతగా బలపడుతున్నాయి. 2014, 2018 వరుస ఎన్నికల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో విలక్షణమైన తీర్పును ఇచ్చి, బీఆర్ఎస్‌కు షాకిచ్చిన ఓటర్లు మరోమారు మరింతగా 'కమ్మ'ని షాకివ్వనున్నారా..? పదికి పది గెలుస్తామని ప్రకటిస్తున్న కాంగ్రెస్ నేతల నోటిమాటలు నిజం చేస్తారా..? ఇవన్నీ ప్రతీ ఓటరు మదిని తొలుస్తున్న ప్రశ్నలు.

ఉమ్మడి ఖమ్మం జిల్లా బ్యూరో, కెరటం న్యూస్



# బిఆర్ఎస్‌లో గో.పి.లు..!?

- ఉండేదెవరో..వెళ్లేదెవరో.. బీఆర్ఎస్‌ను వెంటాడుతున్న ప్రశ్న
- ఖమ్మం నియోజకవర్గంలో తుమ్మల వేట షురూ
- ఓట్ల వేటలో రాజకీయ చాణక్యుడు..
- రాహుల్ పర్యటనలో ఖమ్మం జిల్లాలో కాంగ్రెస్‌లోకి భారీ వలసలు..?
- వేగంగా మారుతున్న రాజకీయ సమీకరణలు..
- కాంగ్రెస్ నాయకులకు సినిమా చూపిస్తానంటున్న అజయ్

**కాకరేపుతున్న ఖమ్మం రాజకీయం...**

ఇప్పుడు తెలంగాణ రాష్ట్రంలో ఖమ్మం జిల్లా రాజకీయాలు హాట్ టాపిక్‌గా మారాయంటే అతిశయోక్తి కాదు. ఎందుకంటే ఇక్కడ రాజకీయ ఉద్దండుల నడుమ పోరుకు వేళైంది. ప్రధానంగా ఖమ్మం నియోజకవర్గంతో పాటు పాలేరు నియోజకవర్గాలు అత్యంత రాజకీయ వేడిని రగుల్చుతున్నాయి. ఖమ్మంలో ఇద్దరు కమ్మ సామాజిక వర్గానికి చెందిన నాయకులు పువ్వాడ అజయ్, తుమ్మల నాగేశ్వరరావు, పాలేరు నియోజకవర్గంలో ఇద్దరు రెడ్డి సమాజిక వర్గానికి చెందిన వారు కందాళ ఉపేందర్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి. ఈ రెండింటి స్థానాల్లో హోరాహోరీ పోరుతప్పదని ఇప్పటికే రాజకీయ పరిశీలకులు ప్రకటించారు. ఈ క్రమంలోనే ఖమ్మం నియోజకవర్గంలో ఇటీవల కార్పొరేటర్లు మంత్రికి షాకివ్వడం, తుమ్మల నాగేశ్వరరావే మాకు గాడ్ ఫాదర్ అని ప్రకటించి హస్తం గూటికి చేరడం బీఆర్ఎస్‌ను అయోమయంలోకి నెట్టింది. ఉన్న కార్పొరేటర్లలో మరో పాతిక మంది వరకూ కాంగ్రెస్‌లో టచ్‌లో ఉన్నరని ప్రచారం జరుగుతుండటంతో ఎవరెప్పుడు ఎలా జంప్ అవుతారో తెలియని అనుమానం.

**మంత్రి అజయ్, ఎమ్మెల్సీ తాతా మధు టార్గెట్‌గా విమర్శలు..**

నాలుగు రోజులకిందట బీఆర్ఎస్‌నుండి కాంగ్రెస్‌లో చేరిన కార్పొరేటర్లు, మాజీ ఎమ్మెల్సీ బాలసాని మాట్లాడుతూ ప్రధానంగా జిల్లా మంత్రి పువ్వాడ అజయ్ నిరంకుశంగా వ్యవహరిస్తున్నారనీ, బీఆర్ఎస్‌లో ఎంత కష్టపడి పనిచేసినా గుర్తింపు ఇవ్వడనీ, తన దారికి రాని వారికి బెదిరింపులు, భయపెట్టడాలు, తప్పుడు కేసుల్లో ఇరికించడాలు అనేవి నిరంకుశంగా మారిందని కార్పొరేటర్లు వ్యాఖ్యలు చెయ్యడం ఖమ్మం నియోజకవర్గంలోనే కాదు, ఉమ్మడి జిల్లాలో తీవ్ర చర్చకు దారితీశాయి. ఈ అంశాలు అన్నీ కూడా సీఎం కేసీఆర్, కేటీఆర్ వరకూ వెళ్లాయని కూడా చర్చ జరుగుతోంది. కాంగ్రెస్‌లో చేరిన నేతలు అంతటితో ఆగకుండా రాబోవు ఎన్నికల్లో ఎట్టిపరిస్థితుల్లోనూ పువ్వాడ అజయ్‌ను ఓడించి తీరుతామనీ, అది తమ బాధ్యత అని ప్రకటించడం అతిపెద్ద చర్చకు తెరలేపింది. పువ్వాడకు ఓటమి భయం పట్టుకుందనీ, అందుకే బీఫామ్ తీసుకున్న ఆనందం కూడా లేకుండా పరుగులు పెడుతూ ఖమ్మం వచ్చారని ఎద్దేవా చేశారు. ఇదిలా ఉండగా ఇక మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ తాతా మధును టార్గెట్ చేస్తూ తన మనసులోని మాటలు బయటపెట్టారు. తాను పార్టీ మారడానికి కారణం తాతా మధు వ్యవహార శైలి అని అన్నారు. ఆయన ఏమైనా పెద్ద తోపా.. ఆయనకు బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ, భద్రాచలం నియోజకవర్గ ఇంచార్జ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇలా నాలుగు పదవులు ఎందుకు..? ఆయన పార్టీకి చేసిందేమిటి..? తెలంగాణ ఉద్యమంలో ఆయన పాత్ర ఏంటి..? అంటూ వివిధ మీడియా సంస్థలతో జరిపిన ఇంటర్వ్యూల్లో బాలసాని తన మనసులోని మాటలన్నీ వెళ్లగక్కారు. తనను బీసీని కాబట్టే అగ్ర కులాలు టార్గెట్ చేసి ఎదగకుండా చేశారని బాలసాని ఆవేదన వ్యక్తం చేశారు.

**బీఆర్ఎస్‌లో కాంగ్రెస్ కోవర్టులా..?**

ఖమ్మంలో రాజకీయాలు రసవత్తరంగా మారిన క్రమంలో కాంగ్రెస్ పార్టీ మరో మైండ్ గేమ్‌కు తెరలేపినట్టు చర్చ జరుగుతోంది. వాస్తవమో కాదు తెలియదు కానీ, ఖమ్మం కార్పొరేటర్లలో సుమారు పాతిక మంది వరకూ త్వరలోనే రాహుల్ పర్యటనలో చేతి గుర్తు పార్టీలోకి వస్తారని అంటున్నారు. ఇప్పుడు బీఆర్ఎస్‌లో తమ కోవర్టులు ఉన్నారని కూడా చర్చ జరుగుతోంది. ఇదే నిజమైతే బీఆర్ఎస్‌కు ఖమ్మంలో కష్టాలు తప్పవా అనే చర్చకు తావిస్తోంది.

**ఖమ్మంలో దూకుడు పెంచిన తుమ్మల**

రాజకీయ రంగంలో గత నలభై ఏళ్లుగా తనదైన శైలిలో ప్రత్యర్థులకు చుక్కలు చూపించే అపర చాణక్యుడు తుమ్మల నాగేశ్వరరావు కాంగ్రెస్ పార్టీ లో చేరిన తరువాత దూకుడు పెంచారు. ఖమ్మం జిల్లాలో బిఆర్ఎస్ ను నిలువరించడమే ధ్యేయంగా పథకాలు రచించి నివురు గప్పిన నిప్పులా ప్రణాళికలు రూపొందిస్తూ.. అమలు దిశగా వేగంగా అడుగులేస్తున్నారు. ఇటీవల మాజీ ఎమ్మెల్సీ బాలసాని తో సంప్రదింపులు జరిపి కాంగ్రెస్ కండువా కప్పిన ఆయన మరో అడుగు ముందుకేసి ఖమ్మం కార్పొరేటర్‌లతో చర్చలు జరిపారు. హడావిడిగా జరిగిన కార్యక్రమాల్లో వెంటనే అనుకున్నంతమంది బైటికి రాలేక పోయినా, త్వరలోనే రాహుల్ తెలంగాణలో ప్రారంభించ బోయే బస్సు యాత్ర సందర్భంగా కాంగ్రెస్ లోకి వలసలు ఉండబోతున్నట్లు సమాచారం.

**ఎన్నికలప్పుడు ఇవన్నీ మామూలేనన్న మంత్రి అజయ్..**

ఖమ్మంలో జరుగుతున్న పరిస్థితులను గురించి వివిధ మీడియా సంస్థలకు మంత్రి పువ్వాడ అజయ్ ఇంటర్వ్యూ ఇస్తూ రాజకీయాల్లో ఇవన్నీ సహజమేననీ, ఎన్నికలప్పుడు సహజంగా మార్పులు చేర్పులు జరుగుతుంటాయని కొట్టిపారేశారు. తన వెంట ఉండి పదవులు అనుభవించి తీరా కీలక సయమంలో వెన్నుపోటు రాజకీయాలకు పాల్పడటమే నమ్మక ద్రోహమని ప్రకటించారు. ఇలాంటి ఆటుపోట్లు తనకు మామూలేనని మంత్రి స్పష్టం చేశారు. ఎన్ని కుయుక్తులు పన్నినా తుమ్మల నాగేశ్వరరావుకు తన చేతిలో ఓటమి తప్పదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ నాయకులకు సినిమా చూపిస్తానని ఎద్దేవా చేశారు.